క్లుప్తంగా

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవానికి ముస్తాబైన బాబా ఆలయం

ఎస్.రాయవరం : రేవుపోలవరం తీరాన్ని ఆనుకుని ఉన్న శ్రీ షిరిడిబాబా ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. లక్ష్మీమాధవస్వామి ఆలయానికి ఆనుకుని నిర్మించిన బాబామందిరంలో 8 ఏళ్లుగా వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా బాబాకు ఉదయం కాగాడ హారతి, సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించి పంచామృత అభిషేకం, మధ్యాహ్నం హారతి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహిస్తామని, సాయంత్రం వైభవంగా ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పుష్పాలతో అలంకరణ చేసి ముస్తాబు చేశారు.

పాండురంగ ఆలయంలో పూజలు

పాయకరావుపేట : పట్టణంలో శ్రీరాధా రుక్మిణీ సహిత పాండురంగ దేవస్థానంలో స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం పసుపు దంచడం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 28న రథ సప్తమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి నరిసే వెంకటేశ్వరరావు, ఆలయ అర్చకులు యియ్యుణ్ణి కృష్ణస్వామి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

29న ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష

మునగపాక : ఈనెల 29న మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్ష జరుగుతుందని స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి సత్యనారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఎన్ఎంఎంఎస్ ప్రవేశపరీక్షకు ముందస్తుగా విద్యార్థుల విజ్ఞానాన్ని తెలుసుకునేందుకు ఈ నమూనా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే నమూనా పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 8919360208 ఫోన్ నంబరును సంప్రదించాలని కోరారు.

ఏఈవో ప్రసాద్ మృతికి సంతాపం



బి.వి. ప్రసాద్(ఫైల్)

రాంబిల్లి: మండల వ్యవసాయ విస్తరణ అధికారి బి.వి. ప్రసాద్ మృతి చెందారు. బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా ప్రసాద్ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. అంత్యక్రియలు బుధవారం యలమంచిలిలో నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఏడీ సుమంత ఇతర అధికారులు, వ్యవసాయశాఖ సిబ్బంది పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు ప్రసాద్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రసాద్ రైతులకు మెరుగైన సేవలందించడంతో మంచి పేరు ఉంది.

మంచినీటి బోరు ప్రారంభం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని మోసయ్యపేటలో బుధవారం గాజువాక సీఎల్‌సీ చర్చి యాజమాన్యం సహకారంతో ఏర్పాటు చేసిన మంచినీటి బోరును ప్రారంభించారు. చర్చి ప్రతినిధులు ఆల్ఫ్రెడ్ మహంతి, ఎంపీపీ భర్త కోన బుజ్జి, సర్పంచ్ పైడిరాజు, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, ఎంపీటీసీ లాలం శ్రీను, రెవ ఎం.సుధీర్‌కుమార్, పాస్టర్ రాజశేఖర్, సచివాలయ కన్వీనర్ కొమ్మోజు ఈశ్వరరావు పాల్గొన్నారు.

పురస్కారాలకు ఎంపిక

మునగపాక : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం మండలంలోని ఏడుగురు అధికారులు పురస్కారాలు అందుకోనున్నారు. పలు విభాగాలకు సంబంధించి ఎంపికైన అధికారులు అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చేతులమీదుగా ఉత్తమ అవార్డులు అందుకోనున్నారు. ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, ఉమ్మలాడ ఏఎన్ఎం మరియారత్నం, మెలిపాక మహిళా పోలీసు కోట్ని గంగాభవాని, గణపర్తి పంచాయతీ కార్యదర్శి బుజ్జిబాబు, మునగపాక సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ అనిత, గంటవానిపాలెం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మాధురిలు ఉత్తమ పురస్కారాలకు ఎంపికయ్యారు.

సామాన్యుడి వజ్రాయుధం ఓటు హక్కు

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానేశ్వరి
- ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



కె.వెంకటాపురంలో మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



ఎస్.రాయవరంలో విద్యార్థుల మానవహారం

యలమంచిలి : ప్రజాస్వామ్యంలో సామాన్యుడి వజ్రాయుధం ఓటు హక్కు అని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానేశ్వరి అన్నారు. బుధవారం యలమంచిలి తహసీల్దారు కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవంపై ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు, యువతీ యువకులకు ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని, ఓటు హక్కు గల ప్రతి ఒక్కరూ దానిని విధిగా వినియోగించుకోవాలని, చట్టసభలకు సరైన వ్యక్తులను ఎన్నుకోవాలని, ప్రలోభాలకు లొంగకుండా ప్రజాస్వామ్య విలువలు కాపాడాలని, ఎన్నికల్లో ఓటు హక్కును దుర్వినియోగం చేయకూడదని అవగాహన కల్పించారు. ఓటరు కార్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలకు, భారతదేశ పౌరుడిగా గుర్తింపు ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా కాని సంబంధిత బీఎల్‌వోని సంప్రదించి దరఖాస్తులు అందజేస్తే ఓటరుగా నమోదు అవుతారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాణీ అమ్మాజీ, ఎంపీడీవో ప్రసాదరావు, ఎంఈవో విశ్వనాథం, మున్సిపల్ డీఈ వీరయ్య, టౌన్ ప్లానింగ్ అధికారిణి శ్రీలక్ష్మి, విశ్రాంత అధ్యాపకుడు ఆదారి పూరీ జగన్నాథం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

మునగపాక : ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.బాబ్జీ కోరారు. జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటరు నమోదు చేయించుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా నీతి నిజాయితీలతో పనిచేసేవారిని ఓటు ద్వారా ఎన్నుకోవాలన్నారు. ఎంపీడీవో రవికుమార్, ఈవోఆర్డీ ఈశ్వరరావు, ఆర్ఐ రమేష్,మహిళా పోలీసు శ్రావణి.మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోటవురట్ల : జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ కార్యక్రమాలు నిర్వహించారు. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. లింగాపురం ఎంపీపీ స్కూల్లో హెచ్ఎం నర్సింగరావు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ ప్రేమ్‌సాగర్, ఎంఈవో అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం

ఎస్.రాయవరం : జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని ఎస్.రాయవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించి, వారితో ప్రతిజ్ఞ చేయించారు. మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ సిబ్బంది, గ్రామ పంచాయతీల్లో పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌వోలు ఓటర్ల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించి ప్రతిజ్ఞ చేయించారు. పలువురు సీనియర్ ఓటర్లను సన్మానించారు.

పాయకరావుపేట : ప్రతి ఓటరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఓటు ఎంతో విలువైనదని మండల తహసీల్దార్ కె.జయప్రకాష్ అన్నారు. 13 వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఓటు హక్కు పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఓటు విలువను వివరించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో కె.ఎన్.గాంధీ, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు సత్కారం

నక్కపల్లి: జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు బుధవారం నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లు నవర నూకరాజుశర్మ, కొల్నాటి అప్పారావులను ఘనంగా సన్మానించారు. పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో పాలకులను ఎన్నుకునే క్రమంలో ఓటు హక్కును మించిన ఆయుధం మరొకటి లేదని తహసీల్దార్ సుబ్రహ్మణ్యశాస్త్రి అన్నారు. అర్హులకు ఓటు హక్కు గుర్తింపు కార్డులు అందజేసారు. కొత్త ఓటర్ల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. ఎంఈవో డీవీడీ ప్రసాద్ మాట్లాడుతూ ఓటు అనే ఆయుధానికి ఓటరు విచక్షణ అనే శక్తిని జోడించాలన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం రాణిలలిత, డీటీ తాతాచార్యులు, ఆర్ఐ శ్రీపాద ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏటికొప్పాకలో అవగాహన ర్యాలీ

యలమంచిలి : ఏటికొప్పాక గ్రామంలో బుధవారం జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణీ రాము ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని సూచించారు. హైస్కూల్ విద్యార్థులతో కలసి ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కరణం రవి, స్కూల్ చైర్మన్ దేవరపల్లి రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొక్కిరాపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బొడ్డేడ సత్యనారాయణ విద్యార్థులకు ఓటరు నమోదు పై అవగాహన కల్పించారు.

రాంబిల్లి: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం అని తహసీల్దార్ పి. భాగ్యవతి అన్నారు. రాంబిల్లిలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీనియర్ సిటిజన్, గొరపూడి ఎంపీటీసీ లాలం చినసత్యంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రవి, మీనాక్షి, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్ఞానేశ్వరి



ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ బాబ్జీ, ఎంపీడీవో రవికుమార్



పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



నక్కపల్లిలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ శాస్త్రి

సీఎస్ఆర్ నిధులతో మౌలిక సదుపాయాలు



జంగులూరులో మినీ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



ధర్మవరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం-రాంబిల్లి సెజ్‌లోని కంపెనీల కార్పొరేట్ సామాజిక బాధ్యత ద్వారా పలు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) అన్నారు. అచ్యుతాపురం మండలంలోని జంగుళూరులో ఏసియన్ పెయింట్స్ సహకారంతో రూ.30 లక్షల నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంక్, మైతాన్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన మినీ వాటర్ ప్లాంట్‌ను బుధవారం ప్రారంభించారు. మోసయ్యపేట పంచాయతీ గాజువాక రోడ్డు సంత మార్కెట్ వద్ద ఏసియన్ పెయింట్స్ సీఎస్ఆర్ నిధులు పది లక్షల రూపాయలతో నిర్మించిన మరుగుదొడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు నర్మాల కుమార్, ఎంపీపీ భర్త కోన బుజ్జి, సర్పంచ్ విమలనాయుడు, ఎంపీటీసీ లాలం శ్రీను, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, రెండు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

లంక ధర్మవరంలో సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ సచివాలయం పరిధిలో లంక ధర్మవరం, మెట్ట ధర్మవరం, గొర్లె ధర్మవరం గ్రామాల్లో ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు) బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లంక ధర్మవరంలో సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. నవరత్నాల కరపత్రాలను అందజేశారు. అర్హులెవరికైనా పథకాలు అందకుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గడిచిన మూడేళ్లలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామని తెలిపారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా పథకాలను అందజేస్తూ సామాజిక న్యాయం పాటిస్తున్నామని తెలిపారు. వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని, సచివాలయ సిబ్బంది సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీపీ భర్త కోన బుజ్జి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, స్థానిక పంచాయతీ ప్రతినిధులు, నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, మండల స్థాయి అధికారులు, పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ వెంకటనారాయణ

నక్కపల్లి : పంచాయతీల్లో ఇంటిపన్ను వసూళ్లపై కార్యదర్శులు దృష్టి సారించాలని ఈవోపీఆర్డీ వెంకటనారాయణ సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇంటిపన్నుల బకాయిలను వసూలు చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. పంచాయతీల్లో సాధారణ నిధులను సమకూర్చుకోవడం, ఇంటిపన్నుల వసూళ్ల ద్వారా సాధ్యమవుతుందన్నారు. కార్యదర్శులు శానిటేషన్‌పై కూడా దృష్టి సారించాలని, క్లోరినేషన్ కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. చెత్త నుంచి వర్మికంపోస్టు తయారు చేసే ప్రక్రియ ప్రారంభించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా ఇంజినీరింగ్ సిబ్బందిని అప్రమత్తం చేయాలన్నారు. కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.

నేడు గుండాల పైడితల్లమ్మ తీర్థం



పైడితల్లమ్మ అమ్మవారు

రాంబిల్లి : ధార భోగాపురం గ్రామంలో గుండాల పైడితల్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ కిల్లాడ అప్పారావు తెలిపారు. ఏటా వసంత పంచమి రోజున గుండాల పైడితల్లమ్మ తీర్థ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. కిల్లాడ వంశస్థుల ఇలవేల్పుగా అవతరించిన ఈ పేరంటాలు అమ్మవారు దశాబ్దాల కాలంగా పూజలందుకుంటున్నారు. కిల్లాడ శ్రీనివాసరావు, ఉషారాణి దంపతులు ఇక్కడ అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. తీర్థ మహోత్సవం సందర్భంగా భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్ల, తోడపెద్దు సేవ, చిడతలు వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

వలంటీర్లకు నియామక పత్రాలు



వలంటీర్లకు నియామక పత్రాలు అందిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: వలంటీర్లు సమాజసేవకులుగా, ఆదర్శంగా మెలగాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. కైలాసపట్నం, సుంకపూరు గ్రామాల్లో కొత్తగా వలంటీర్లుగా నియమితులైన వారికి బుధవారం నియామకపు పత్రాలు అందజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు పారదర్శకంగా అందించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జ్యోతి పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉజ్వల భవిత



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సైకాలజిస్ట్ జేఎన్‌వీ రావు

మునగపాక : విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని ప్రముఖ సైకాలజిస్టు జేఎన్‌వీ రావు పేర్కొన్నారు. తిమ్మరాజుపేట ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్(తోసా) ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌తో పాటు యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రావు మాట్లాడుతూ చదువులో ఏకాగ్రత అవసరమన్నారు. యోగా గురువు కళాధరరావు మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ప్రశాంతత, ఆరోగ్యం కలుగుతుందన్నారు. తద్వారా చదువుపై దృష్టి సారించవచ్చన్నారు. తోసా అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం సునీత, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, తోసా సభ్యులు పాల్గొన్నారు.

కోతుల బెడదపై గ్రామసభలో చర్చ



గ్రామ సభలో మాట్లాడుతున్న కార్యదర్శి నరేష్

పాయకరావుపేట : మాసాహేబుపేట గ్రామస్తులు గ్రామ సభలో కోతుల్ని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం సర్పంచ్ గెడ్డమూరి నీలవేణి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో గ్రామంలో కోతుల సమస్యపై చర్చించారు. పంచాయితీ సాధారణ నిధుల నుంచి లక్ష రూపాయలు ఖర్చు పెట్టడానికి, గ్రామస్తులు ఆర్థిక సహకారంతోను కోతుల్ని పట్టించి ఏజెన్సీ ప్రాంతంలో విడిచిపెట్టడానికి గ్రామసభలో తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ కొంతం నరేష్, గెడ్డమూరి శ్రీనివాస్, కార్యదర్శి కె.నరేష్ పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్‌లో సరస్వతీ పూజ



సరస్వతీదేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల అనుబంధ సంస్థ అయినా స్పేసెస్ డిగ్రీ కళాశాలలో వసంతి పంచమి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల డైరెక్టర్ (హెచ్ఆర్) డా.వి.వి.ఎస్.బి బంగ్రారాజు, స్పేసెస్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పెనుగొండ సుబ్బారావు, విద్యార్థులు భక్తితో చదువుల తల్లి సరస్వతీదేవికి పూజలు నిర్వహించారు. అధ్యాపకుడు తారక రామారావు విద్యార్థులకు వసంత పంచమి విశిష్టతను వివరించారు.

నేత్రపర్వంగా గౌరీపరమేశ్వరుల కల్యాణోత్సవం

అనకాపల్లిటౌన్ : పట్టణంలో గవరపాలెం గౌరీపరమేశ్వరుల కల్యాణం బుధవారం నేత్రపర్వంగా సాగింది. ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, సింధుజ దంపతులచే పురోహితులు నేతేటి సుబ్రహ్మణ్యశర్మ కల్యాణం జరిపించారు. కల్యాణం వీక్షించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అంతకుమందు గౌరీపరమేశ్వరుల కల్యాణ విగ్రహాలను పురవీధులగుండా ఊరేగించారు.

భారీ ఎత్తున సారె ఊరేగింపు

ఆలయం నుంచి మధ్యాహ్నం 3 గంటలకు 1000 మంది ముత్తయిదువలు తమ ఇళ్లల్లో తయారుచేసిన బూరెలు, అరిసెలు, గవ్వలు, సున్నుండలు, పూతరేకులు, జంతికలు, మురుకులు, పాలముంజెలతోపాటు పసుపు, కుంకుమ, విభూదిలింగం, చీరలు, కూరగాయలు, వాహనాలు, ఫర్నీచర్ ఊరేగించారు. సతకంపట్టు, సంతబయల, చింతావారి వీధి, మెయిన్‌రోడ్డు, పార్కుజంక్షన్ మీదుగా ఊరేగింపు ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె నివేదించారు. తీన్మార్, బ్యాండ్, సన్నాయిమేళాలు, డీజే తదితర కార్యక్రమాలు ఊరేగింపు ముందు ఆకర్షణగా నిలిచాయి. ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు ఎంపీ దంపతులను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూక సత్యనారాయణ, ఆలయ ప్రతినిధులు కొణతాల బాబూరావు, కొణతాల మురళీకృష్ణ, పి.వి.రమణ, కొణతాల ప్రసాద్, దాడి కృష్ణ, పెంటకోట జగది, సూరిశెట్టి నర్సింగరావు, బుద్ద భూలోకనాయుడు, కొణతాల కృష్ణంరాజు, కాండ్రేగుల శ్రీను, కె.ఎం.నాయుడు, పాలిమేర శ్రీను, పెంటకోట సన్యాసినాయుడు, గండేపల్లి మురళీ, దొడ్డి భోగేష్, బుద్ద సంతోష్, పెంటకోట లక్ష్మీనారాయణ, మళ్ల రాజు, కొణతాల లోకేష్, పాలమరశెట్టి సూర్య, దొడ్డి జీవన్ పాల్గొన్నారు.

శ్మశానవాటికలో చేతిబోరు



నీలిగుంట శ్మశాన వాటికలో చేతిబోరు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

కోటవురట్ల : నీలిగుంట గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో నెరవేరింది. గత ప్రభుత్వాల హయాంలో ఎన్నోమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దహనక్రియలకు వచ్చేవారు స్నానాలకు తీవ్ర ఇబ్బంది పడేవారు. కాగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించగా గ్రామస్తులు ఈ సమస్యను వివరించారు. స్పందించిన ఆయన చేతిబోరు ఏర్పాటుకు అధికారులకు ఆదేశాలిచ్చారు. సర్పంచ్ కన్నంరెడ్డి వరహాలబాబు గ్రామస్తుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ముగ్గుల పోటీలకు విశేష స్పందన



మునగపాకలో ముగ్గులు వేస్తున్న దృశ్యం

మునగపాక : గౌతమ పఠన మందిరం వార్షికోత్సవంలో భాగంగా బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. సంతబయిల వినాయక ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన ముగ్గులను తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు. పలు రకాల రంగవల్లులు అందరినీ ఆకట్టుకున్నాయి. విజేతలకు గురువారం సాయంత్రం బహుమతులు అందజేస్తామని మందిర కార్యదర్శి వెలగా శ్రీనివాసరావు తెలిపారు.